ప్రజాశక్తి

శుక్రవారం 31 మే 2024

5

అల్లూరి సీతారామరాజు



గ్రంథాలయంలో యోగా పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు, చిన్నారులకు గురువారం యోగా పోటీలను నిర్వహించారు ఈ పోటీల్లో సుమారు 30 మంది చిన్నారులు పాల్గొన్నారు. గ్రంథాలయ శాఖ అధికారిని ఎస్.సునీత మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు యోగా, వ్యాయామం చేయాలన్నారు. దీంతో, శారీరక దృఢత్వం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న విద్యార్థులు


డీడీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలి

- ఎస్ఎఫ్ఐ నేతల వినతి

ప్రజాశక్తి- పాడేరు: అల్లూరి జిల్లా గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ సీట్లను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, జీవన్ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాడేరు డివిజన్‌లో బాలికల గురుకుల కళాశాలలు 3 మాత్రమే ఉన్నాయన్నారు. బాలికల గురుకుల కళాశాలలను అదనంగా విస్తరించాలని, ఉన్న వాటిలో అదనంగా అధ్యాపకులను నియమించి తరగతులను పెంచాలని కోరారు. మే 22న బాలికలకు గురుకుల కళాశాలలో ప్రవేశంకు కౌన్సిలింగ్ నిర్వహించి కేవలం 450 మందికి మాత్రమే సీట్లు ఇచ్చారని తెలిపారు.. సుమారుగా 2,400 మంది విద్యార్థినిలు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా 450 మందికి మాత్రమే సీట్లు వచ్చాయని తెలిపారు. ప్రతి గ్రూపునకు సీట్లు పెంచి మరి కొంతమందికి అవకాశం కల్పించాలన్నారు. రెండవ విడత కౌన్సిలింగ్ నిర్వహించాలని, లేకపోతే చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందని అన్నారు.. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గురుకుల కళాశాలలు పెంచి గిరిజన విద్య ప్రమాణాలకు పెంపునకు కృషి చేయాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి గిరిజన విద్యార్థినిలకు సీట్లు ఇవ్వాలని, ప్రతి గ్రూపుకు అరవై సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు..జిల్లాలో బాలికల గురుకుల కళాశాలలు అదనంగా పెంచాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో చిన్నారావు పాల్గొన్నారు..

పరుగు పందెంలో గిరిజన క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - అరకులోయ: ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఉత్తప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో ఖేలో భారత్ యూత్ గేమ్స్ నేషనల్ ఛాంపియన్ షిప్ నిర్వహించారు. అథ్లెటిక్స్ విభాగం 10 కిలో మీటర్ల పరుగు పందెంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం పెదలబుడు పంచాయితీ గరుడగుడ గ్రామానికి చెందిన కిల్లో బుద్ధు ప్రథమ స్థానం సాధించాడు. 5 కిలోమీటర్ల విభాగంలో అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ తుమ్మనవలస గ్రామానికి చెందిన కొర్ర గోపి అనే గిరిజన యువకుడు ప్రథమ స్థానం సాధించినట్లు విజేతలు బుద్ధు, గోపిలు గురువారం విలేకరులకు తెలిపారు. పరుగు పందెంలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు స్థానికులు అభినందించారు.



క్రీడాకారులు బుద్ధు, గోపి


చింతపల్లిలో జెండాకు సెల్యూట్ చేస్తున్న చిన్నయ్యపడాల్, నాయకులు, గిరిజనులు

ఘనంగా సిఐటియు ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: సమ సమాజం నిర్మాణమే సిఐటియు లక్ష్యమని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని పద్మావతి గార్డెన్ వద్ద జెండాను ఆవిష్కరించారు.అనంతరం మాట్లాడుతూ, నూతన ఆర్థిక విధానాలతో కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి సిఐటియు పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యతను కాపాడుతూ సిఐటియు అండగా ఉందని తెలిపారు. రైతాంగ పోరాటాలకు మద్దతుగా సిఐటియు నిలిచిందని తెలిపారు. రాబోయే రోజుల్లో పాలకులు కార్మిక వర్గం ఐక్యతను దెబ్బతీసే విధంగా కుట్రలు చేస్తాయని భవిష్యత్తులో కార్మిక వర్గం ఏకం ఏకమై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాజు, గురుమూర్తి, సీతారం, శ్రీరామ్, గుండురావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : బూర్జువా, భూస్వామ్య, పెట్టుబడుదారీ వ్యవస్థపై పోరాటం ఎల్లప్పుడూ చేస్తామని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. గురువారం చింతపల్లి మండల కేంద్రంలో హెచ్ఎన్‌టీసీ, ఆర్ఎఆర్ఎస్ కార్మికులతో కలిసి సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పని గంటల పోరాటం నెత్తుటి దార నుంచి సిఐటియు 1970లో పుట్టిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎర్రజెండా రాజ్యం ఏర్పడితేనే సమస్త మానవాళికి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈనెల 4న రాష్ట్రం, దేశంలో ఏర్పడబోయే ఏ కొత్త ప్రభుత్వమైనా ప్రజలకు, కార్మికులకు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనుగుణంగా పరిపాలన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లేకుంటే ఎర్రజెండా చేతబూని ఉద్యమించాల్సి వస్తుందన్నారు. ఇండియా కూటమి గెలుపుతోనే కార్మికుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాజేశ్వరి, రాజులమ్మ, అర్జున్, రాధాకష్ణ, నర్సింగరావు నాయుడు పాల్గొన్నారు.


అరకులోయలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు


కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయసునీత

కౌంటింగ్ కేంద్రంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-రంపచోడవరం

వచ్చేనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపునకు సంబంధించి కౌంటింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ యం.విజయ సునీత పేర్కొన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, అసెంబ్లీకి, పార్లమెంటుకు వేరువేరుగా ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపునకు వచ్చే సిబ్బందికి, ఏజెంట్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఎక్కడికక్కడ బారికేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లో కరెంట్‌కు ఇబ్బంది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్.హెచ్, తహశీల్దార్లు ఎ.కృష్ణ జ్యోతి, ఎవి.రమణ, సత్యసులోచన, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ మోహనరావు తదితరులు ఉన్నారు.


జనం లేక నిర్మానుష్యంగా ఉన్న సీలేరు మార్కెట్ సెంటర్

బెంబేలెత్తిస్తున్న భానుడు

సీలేరులో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి-సీలేరు

గత నాలుగు రోజులుగా భానుడు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాడు. ఎండ తీవ్రత, వడగాల్పులు కారణంగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో గత మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. గురువారం ఉదయం 6 గంటల నుంచి భానుడు నిప్పులు కక్కుతూ తన ప్రతాపాన్ని చూపడంతో 42 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఒంటిగంట సమయంలో ఎండ మరింత తీవ్రమై వడగాల్పులు వీయడంతో వేడి గాలులకు తాళలేక వ్యాపారాలు దుకాణాలు మూసివేసి ఇళ్లకే పరిమితమయ్యారు. ఏసీలు కూలర్లు కూడా ఉష్ణోగ్రత దాటికి పనిచేయడం లేదు. వాటి నుంచి కూడా వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇళ్లల్లో కూడా ఉండలేని పరిస్థితి నెలకొంది. ఇదే తరహాలో మరి కొద్ది రోజులు ఉష్ణోగ్రత నమోదైతే వృద్ధులు వడగల్పులకు గురై మృత్యువాత గురయ్యే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోహిణి కార్తి కారణంగా రానున్న రోజుల్లో మరింత ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ కేంద్ర అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు ఎండ దెబ్బ, వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

టిబి వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-దేవీపట్నం

మండలంలోనిఇందుకూరుపేట గ్రామం స్థానిక రామాలయం వద్ద టీబి వ్యాధి నివారణకు అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ గురువారం చేపట్టారు. టీబీ వ్యాధి నివారణలో భాగంగా ముందస్తుగా 18 సంవత్సరాలు దాటిన వారందరికీ టీకాలు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందరని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వాక్సినేషన్ చేయించుకోవాల్సిందిగా కోరారు.


వ్యాక్సినేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

ఖరీఫ్ సాగుపై సమీక్ష

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రంలోని సీతగుంట సచివాలయంలో గురువారం అల్లూరి జిల్లా వ్యవసాయ అధికారి ప్రభాకర్ వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, మండలంలో 16 సచివాలయం వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికపైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ లో విత్తనములు, ఇండెంట్, జీవ నియంత్రకాలతో విత్తనశుద్ధి, పచ్చి రొట్టె ఎరువుల వినియోగం, పిఎం కిసాన్ ఈకెవైసి తదితర వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికులతో అధికారులు

మధ్యాహ్న భోజన కార్మికుల అవగాహన సదస్సు

ప్రజాశక్తి : అరకులోయ : మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కుక్ కం హెల్పర్స్ (సిసిహెచ్) అరకులోయ సిపి హెచ్ స్కూల్లో మండల స్థాయి ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను గురువారం నిర్వహించారు. పీఎం పోషణ్ స్కీమ్‌లో భాగంగా జిల్లా మిడ్ డే మీల్స్ ఏడి అప్పలనాయుడు, కోఆర్డినేటర్ వెంకటరమణల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 160 మంది మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు అవగాహన పరుస్తూ కుకింగ్ కాంపిటేషన్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం వారి వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అరకులోయ మండల విద్యాశాఖ అధికారులు భారతి రత్నం, మోహన్ రావు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపిల క్లినిక్‌లకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-గొలుగొండ: ఆర్ఎంపి వైద్యులు క్లినిక్‌లు నిర్వహించాలంటే తప్పనిసరిగా జిల్లా ఆరోగ్య వైద్యాధికారి అనుమతులు తీసుకోవాలని కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారి హరిప్రవీణ్ సూచించారు. కృష్ణదేవిపేటలో మూడు రోజుల క్రితం నిర్లక్ష్యంతో వైద్యం చేశారనే కారణంతో అల్లూరి క్లినిక్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేశారు. సదరు క్లినిక్ రెండు రోజుల అనంతరం తిరిగి తెరవడంపై అధికారుల ఆదేశాలు పట్టించుకోకపోతే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్లూరి క్లినిక్‌కు సంబంధించిన ధృవపత్రాలతో డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి హాజరు కావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కృష్ణదేవిపేట పరిసర ప్రాంతాల్లో క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఆర్ఎంపి వైద్యులందరూ తమ వద్ద ఉన్న అర్హత ధృవపత్రాలతో డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి హాజరు కావాలని చెప్పారు. ఆ ధృవపత్రాలను డిఎంఅండ్‌హెచ్‌ఓ పరిశీలించిన అనంతరం అనుమతి ఇస్తారన్నారు. లేనిపక్షంలో కృష్ణదేవిపేటలో నిర్వహిస్తున్న క్లినిక్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు.

ముందస్తు వరద సహాయక చర్యలు చేపట్టాలి

- మండల పరిషత్తు సమావేశంలో సభ్యుల డిమాండ్

- వృద్ధులకు సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దే పించను ఇప్పించాలి


మండల పరిషత్తు సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య

ప్రజాశక్తి-కూనవరం

గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తుగానే సహాయక చర్యలు చేపట్టాలని మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని కోతులగుట్ట నూతన గ్రామ సచివాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి పాయం రంగమ్మ అధ్యక్షత గురువారం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ 2022 గోదావరి వరదలకు కూనవరం, టేకులబోరు గ్రామాలు పూర్తిగా నష్టపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్ అండ్ బి రోడ్ నుండి బురదగూడెం మీదుగా శాశ్వతంగా రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. గత వరదల సమయంలో ఆసుపత్రికి తీసుకొచ్చిన గర్భిణులను కింద పడుకోబెట్టిన దారుణ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆసుపత్రిలో జనరేటర్లు ఏర్పాటు చేయాలని, బెడ్స్ పెంచాలని, గర్భిణులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గోదావరి వరద వచ్చిందంటే 20ఏళ్ల క్రితమే హెలికాప్టర్‌ను వినియోగించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే వారని, ఆహార పొట్లాలు అందించే వారని గుర్తు చేశారు. కాని ఇప్పుడు ఇన్ని వరదలు వస్తున్నా హెలికాప్టర్ వినియోగించలేని పరిస్థితి ఉందన్నారు. ఈ ఏడాది వరదల సమయంలోనైనా హెలికాప్టర్‌ను వినియోగించి ప్రజలను ఆదుకోవాలని కోరారు. గతేడాది వరదలకు ఉపయోగించిన బోట్లు, ట్రాక్టర్లకు నేటికీ డబ్బులు ఇవ్వలేదన్నారు. గోదావరి, శబరి ఏరియాలకు వేరువేరుగా లాంఛీలను కేటాయించాలన్నారు. అరకొర సరుకులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకోకుండా ప్రతి నిర్వాసిత కుటుంబానికి రెండు నెలలకు సంబంధించి 50 కేజీల బియ్యం, రూ.5000 నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృద్ధులకు జూన్ నెల పింఛన్లు సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దే అందజేయాలని డిమాండ్ చేశారు.

చిన్నఆర్కూర్ సర్పంచ్ అభిరామ్ మాట్లాడుతూ గతేడాది విద్యుత్ స్తంభాలు వేసినా విద్యుత్ తీగలు వేయలేదని, మళ్ళీ గోదావరి వరద వస్తే చీకట్లో ఉండాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యుత్ తీగలు వేయాలని కోరారు. ఎంపీడీఓ ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ గతేడాది కంటే మెరుగైన సౌకర్యాలతో వరద సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించడానికి అధిక సంఖ్యలో బోట్లను వినయోగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరో నెలలో పుట్టిన బిడ్డకు

ఎస్ఎన్‌సియులో కార్పొరేట్ స్థాయి వైద్యం

- సిహెచ్‌సి వైద్యుల నిరంతర పర్యవేక్షణలో 50 రోజులపాటు వైద్య సేవలు

- కోలుకున్న శిశువు - తల్లి కళ్లలో ఆనందం



మీడియా సమావేశంలో వైద్యులు, వైద్య సిబ్బంది, తల్లీబిడ్డ ఇన్‌సెట్‌లో కోలుకున్న శిశువు

ప్రజాశక్తి- కూనవరం : నెలలు నిండకుండా ఆరో నెలలోనే పుట్టిన బిడ్డ ప్రాణాప్రాయ స్థితిలో ఉండగా, స్థానిక సిహెచ్‌సిలోని నవజాత శిశు కేంద్రం (ఎస్ఎన్‌సియు)లో ఇక్కడి వైద్యులు, సిబ్బంది 50 రోజుల పాటు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించి ఆ బిడ్డను కోల్కొనేలా చేసి, ఆ తల్లి కళ్లల్లో ఆనందం నింపారు. కూనవరం మండలం కోతులగుట్ట సామాజిక ఆరోగ్యం కేంద్రం (సిహెచ్‌సి) సూపరింటెండెంట్ కె.మహేష్‌బాబు తెలిపిన వివరాలు ప్రకారం... వరరామచంద్రాపురం మండలం బూరుగువాడ గ్రామానికి చెందిన కనుముల రాములమ్మ అనే ఆరో నెల గర్భిణిని ఏప్రిల్ 9న పురిటి నొప్పులు వస్తునాయని కోతులగుట్ట సిహెచ్‌సికి బంధువులు తీసుకొచ్చారు. ఆమె అదే రోజు ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆరో నెల ప్రసవం కారణంగా బిడ్డ బరువు సుమారు 1000 గ్రాములు మాత్రమే ఉండడంతో బిడ్డ ప్రాణాప్రాయ స్థితిలో ఉందని వైద్యులు గుర్తించారు. నెలలు పూర్తిగా నిండక పోవడంతో తల్లి గర్భంలో అవయవాల ఎదుగుదల పూర్తిగా లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం లేదా ఖమ్మం తరలించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ సూచించారు. అంత ఆర్థిక స్తోమత తమకు లేదని తల్లిదండ్రులు చెప్పడంతో కోతులగుట్ట సిహెచ్‌సిలోని నవజాత శిశు కేంద్రంలో వైద్యం అందించేందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌బాబు నిర్ణయించారు. ఇక్కడి వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఎస్ఎన్‌సియులో మెరుగైన మందులు వాడి సుమారు 50 రోజుల పాటు వైద్యం అందించారు. లక్షల రూపాయలు ఖర్చయ్యే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ప్రభుత్వ ఎస్ఎన్‌సియు ద్వారా అందించి 1000 గ్రాములు ఉన్న బిడ్డను సుమారు 2 కేజీల బరువు పెరిగేలా వైద్య సేవలు అందజేశారు. బిడ్డ కోల్కొవడంతో గురువారం వైద్యుల పర్యవేక్షణలో ఆ బిడ్డను తల్లికి అప్పగించారు. దీంతో ఆ తల్లి ఆనందానికి అవదులు లేవు. ఐటిడిఎ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డా.పుల్లయ్య గురువారం ఆసుపత్రిని సందర్శించి నవజాత శిశువుకు అందించిన వైద్య సేవల గురించి తెలుసుకొని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వైద్యులను, ఎస్ఎన్‌సియు సిబ్బందిని అభినందించారు. ఇటువంటి వైద్య సదుపాయాలు కూనవరం హాస్పిటల్‌లో ఉండడం ఎంతో గర్వకారణమని ఆసుపత్రి సూపరింటెండెంట్ మహేష్‌బాబు అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ పి.స్వేతశర్మ, సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ టివి.శేషిరెడ్డి, పీడియాట్రిషన్ డాక్టర్ కార్తీక్, డాక్టర్ సుభాష్, డాక్టర్ వివేక్ నాయక్, డాక్టర్ తేజ, ఎస్ఎన్‌సియు హెడ్ నర్స్ బి.బొజ్జి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండుటెండలకు ఉపాధి కూలీలు విలవిల

పనిప్రదేశంలో సౌకర్యాల లేమితో మరిన్ని కష్టాలు


పాడుగుపాలెంలో మండుటెండలకు చెట్టు నీడకు చేరిన ఉపాధి కూలీలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండుటెండలకు ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు విలవిల్లాడిపోతున్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండిపోతుండగా, రోహిణికార్తె ప్రవేశించిన తర్వాత మరింత తీవ్రమయ్యాయి. దీంతో ఉదయం ఎనిమిది గంటల తర్వాత పనిచేయలేని దుస్థితి నెలకొంటోంది. పని ప్రదేశంలో గతంలో మాదిరిగా నీడకు టార్పాలిన్లతో టెంట్లుగానీ, తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్ కిట్ల వంటి సదుపాయాలు లేకపోవడంతో, సమీపంలోని చెట్ల నీడకు పరుగులుతీసి సేదదీరుతున్నారు. ఉపాధి కరువై పనులకు వస్తున్న కూలీలన్నా, వారి ప్రాణాలన్నా ప్రభుత్వాలు, పాలకులు, అధికారులకు చిన్నచూపు ఉండటానికి ఉపాధి పనిప్రదేశంలో నానాటికి లేకుండా చేస్తున్న సౌకర్యాలే నిదర్శనమని కూలీలు మండిపడుతున్నారు. కొన్ని చోట్ల పనిప్రదేశాల్లో చెట్ల నీడ కూడా లేకుండా ఉండని, అలాంటి చోట పనులు చేస్తున్న కూలీలు ఎండ, ఉక్కపోతతో వడదెబ్బకు గురైతే వారి ప్రాణాలకు ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పని ప్రదేశంలో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వపరంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణకు కొలతలు


కొలతలు వేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి అనంతగిరి: మండలంలో తాడిగుడ జలపాతం రోడ్డు పనుల విస్తరణకు కొలతలు వేశామని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ జెఇ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రైబల్ వెల్ఫేర్, రెవిన్యూ శాఖల బృందంతో కలిసి అనంతగిరి మెయిన్ రోడ్డు వైఎస్ఆర్ కొలని, పెద్దరు గ్రామాల రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, నివాస గృహాలు ఉన్నాయన్నారు. రోడ్డు నిర్మాణం నాటికి సుమారు 30 అడుగుల వెడల్పు విస్తీర్ణం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.ఆరు కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా విస్తరణ కు కొలతలు వేసి దుకాణ, ఇల్లు యాజమానులకు వాటిని తొలగించాలని ముందస్తుగా నోటీసులు జారీ చేశామన్నారు. తాడిగుడ, పెద్దరు మధ్యలో వంతెన కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు దాసు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల ఆందోళన

ప్రజాశక్తి-కోటవురట్ల: కనీస కూలి దక్కలేదని మండలంలోని రాజుపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలు గురువారం ఉపాధి పనుల వద్ద ఆందోళన నిర్వహించారు. గడచిన రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వంద రూపాయలు కూడా దక్కక పోవడంతో కూలీలు ఆవేద వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు కూలి రోజుకు రూ. 300 వరకు చెల్లించాలని నిబంధన ఉన్నా టెక్నికల్ అసిస్టెంట్ కావాలనే తప్పుడు కొలతలు వేసి వంద రూపాయలు కూడా దక్కకుండా చేస్తున్నారని కూలీలు తెలిపారు. ఇది ఎంత మాత్రం సమంజసం కాదని సమగ్ర విచారణ చేపట్టి కనీస కూలి దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని కూలీలు హెచ్చరించారు. ఉపాధి పనుల వద్ద కనీస వసతులు కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయమై ఏపీవో గంగు నాయుడును వివరణ కోరగా గ్రామంలో ఉపాధి కూలీలకు వారానికి దాదాపు 1500 వరకు చెల్లిస్తున్నామన్నారు. చెరువు పనుల వద్ద చేపట్టిన క్వాంటిటీ ప్రకారం చెల్లించడంతో పాటు రవాణా చార్జీలు చెల్లిస్తున్నామన్నారు. ఉపాధి పనుల వద్ద కూలీలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పిస్తామని తెలిపారు.

పెదబొడ్డేపల్లిలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పెదబొడ్డేపల్లి యాతపేటలో గురువారం డీఎస్పీ మోహన్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 37 వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు బీబ్రల్ నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇంత వరకు 16 రౌడీషీట్లు, ఐదు సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రజలందరూ సహకరించాలని చెప్పారు. ప్రతి రోజు నర్సీపట్నం డివిజన్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ సిఐ కాంతికుమార్, ఎస్సై సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాలకు టీకాలు

ప్రజాశక్తి - మాడుగుల : గొర్రెలు, మేకలలో చిటికె వ్యాధి నివారణకు టీకాలను వేయించాలని పాడేరు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ సిహెచ్ నరసింహం కోరారు. గురువారం మండలంలోని గొటివాడ అగ్రహారం, సత్యవరం గ్రామాలలో చిటికె వ్యాధి నివారణ టీకాలను ప్రారంభించారు. గొటివాడ అగ్రహారం, సత్యవరం గ్రామాలలో 340 గొర్రెలు, మేకలకు టీకాలు వేయడం జరిగిందని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు. ఇప్పటి వరకు మండలంలోని 6,540 గొర్రెలు, మేకలకు చిటికె వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎయు విసి ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం మెటీరియాలజి అండ్ ఓషనోగ్రఫీ విభాగం ఆధ్వర్యంలో 'కరెంట్ ట్రెండ్స్ ఇన్ ఎట్మోసుఫెరిక్ అండ్ ఓషియానిక్ ప్రాసెసెస్ రిలేటెడ్ టూ క్లైమేట్ చేంజ్ స్టడీస్' అంశంపై సెప్టెంబర్‌లో జాతీయస్థాయి సెమినార్‌ను ఎయులో నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఎయు వి.సి. ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, సదస్సు కన్వీనర్ ఆచార్య పి.సునీత, ఆచార్య.సివి.నాయుడు, ఆచార్య. భానుకుమార్, ఆచార్య.విట్టల్‌మూర్తి డాక్టర్ రావు, డాక్టర్ సివికె.ప్రసాదరావు, డాక్టర్ వివిఎస్ఎన్.మూర్తి, డాక్టర్ కె. సోమసుందర్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలపై అవగాహన కల్పించండి

విశాఖ జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

ప్రజాశక్తి -పద్మనాభం : రైతులకు పచ్చిరొట్ట విత్తనాల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించి, వ్యవసాయ బోర్లున్న చోట విధిగా వేసేలా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. అప్పలస్వామి సూచించారు. గురువారం మండలంలోని కోరాడ, రెడ్డిపల్లి, పొట్నూరు, కృష్ణాపురం, తుని వలస రైతుభరోసా కేంద్రాలను సందర్శించారు. పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా, అమ్మకాలపై వ్యవసాయ అసిస్టెంట్లను ప్రశ్నించి, కొన్ని సూచనలు చేశారు ముందుస్తు ఖరీఫ్‌లో పొలాల్లో వేసిన పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియ దున్నితే భూమి సారవంతం కావడంతోపాటు, యూరియా వినియోగం తగ్గుతుందని, తర్వాత ఖరీఫ్ ప్రధానపంట ఆరోగ్యవంతమైన మంచి దిగుబడి ఇస్తుందని రైతులకు వివరించాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు సిహెచ్ చలం, రావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రగ్బీ క్రీడాకారుల ఎంపిక


రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు సంబంధించి క్రీడాకారుల ఎంపిక స్థానిక వుడా మినీ స్టేడియంలో గురువారం జరిగింది. 18 ఏళ్ల లోపు బాలబాలికలను చెరో 12మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లలిత్‌కుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులతా ఈ నెల 31, వచ్చేనెల ఒకటిన జివిఎంసి నాలుగోవార్డు తిమ్మాపురం విజ్ఞాన్ వరల్డ్ స్కూల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, కోశాధికారి పద్మజ, విజయలక్ష్మి, నల్లా శ్రీనివాస్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

16 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలో రూడకోట జంక్షన్ వద్ద ముందస్తు సమాచారం మేరకు గంజాయి తరలిస్తున్న వారిని అరెస్ట్ చేశామని స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. ద్విచక్ర వాహనంపై గంజాయి రవాణా జరుగుతున్నట్లు ముందుగా సమాచారం రావడంతో రూడకోట జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించామన్నారు. ఇద్దరు వెళుతున్న మోటార్ బైక్‌లో 16 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. వీరు జి.మాడుగుల మండలం లువ్వాసింగి పంచాయతీ సోపల గ్రామం, పెదబయలు మండలానికి చెందిన ఇంజరి పంచాయతీ జమ దాంగి గ్రామానికి చెందిన వారుగా గుర్తించామన్నారు. దీని వెనుక ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సీకుపనస గ్రామానికి చెందిన రాములు పరారీలో ఉన్నాడని, అతనికోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు.

అలరించిన కృష్ణ సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార: సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా పల్లవి మ్యూజిక్ సినీ సాంస్కృతిక సంగీత సంస్థ గురువారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కృష్ణ సినీ సంగీత విభావరి శ్రోతల్ని ఎంతగానో ఆకట్టుకుంది. బి.ఫణిభూషణ్ పాడిన తెలుగు వీర లేవరా, పల్లా బాబ్జి, పావని పాడిన దోరవయసు చిన్నది, ఆంజనేయ రెడ్డి, ఆంబికా పాడిన ఈ గాలిలో ఎక్కడో అలజడి, వెంకటేష్ మాస్టారు, స్వరూప పాడిన ఎక్కడో చూసిన జ్ఞాపకం, వీరేంద్ర, భాగ్యలక్ష్మి పాడిన నమస్తే సుస్వాగతం తదితరుల ఉషారైన గీతాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఘంటసాల క్రీడా సాంస్కృతిక సంఘం కార్యదర్శి చెన్నా తిరుమలరావు, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు సన్ మూర్తి జ్యోతి ప్రజ్వళనతో నిర్వహించిన సినీసంగీత విభావరిలో కీబోర్డుతో సోమేశ్, తబలా ఎవి.చలం, ఫాడ్స్ బాబ్జి, గిటార్ రమణ మూర్తి సహకారాన్ని అందించగా, లక్ష్మి స్వరూప వ్యాఖ్యానం చేశారు.

దివీస్ ఛాలెంజర్స్ ట్రోఫీ ప్రారంభం


దివీస్ ఛాలెంజర్స్ ట్రోఫీలో పాల్గొన్న క్రీడాకారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని పాత మూలకుద్దులో దివీస్ ఛాలెంజర్స్ ట్రోఫీ పోటీలను గురువారం సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు ప్రారంభించారు. 12 పంచాయతీలకు నుంచి 32 జట్లు పాల్గొనగా విజేతలకు రూ. 50వేలు, రన్నరప్‌కు రూ. 25వేలు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నెలరోజుల పాటు దివీస్ సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించే పోటీల్లో క్రీడాకారులకు జెర్సీ, క్యాప్, కిట్లును జిఎం కోటేశ్వరరావు అందజేసారు. సంస్థ డిజెఎం ప్రభాకర్, సిఎస్ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్, సిబ్బంది శ్రీనివాస్, శేఖర్‌బాబు, పైడినాయుడు, నరసింహ పాల్గొన్నారు



అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రక్తదానం చేస్తున్న రక్షణరంగ ఉద్యోగులు

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా ఆ వీరున్ని స్మరించుకుంటూ రక్తదానం చేస్తున్న రక్షణ రంగ కార్మికులు అభినందనీయులని లయన్ ప్రొఫెసర్ ఎన్‌విఎన్.దుర్గాప్రసాద్‌రావు అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం డాబాగార్డెన్స్ సమీపంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను తెలియజేశారు. దేశంలో వామపక్ష భావజాలం బాగా ఉన్న పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలలో మాత్రమే అవసరమైనంత రక్తం దాతల నుండి దొరుకుతోందని, మిగతా దేశమంతటా సరైన సమయంలో రక్తం లేకపోవడం వల్ల రోగులకు ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. లయన్స్ ఇంటర్నేషనల్ లాగానే సిఐటియు నాయకులు సేవాతత్పరత కలిగి ఎల్లప్పుడూ సేవా కార్యక్రమాలు చేపడతారని అన్నారు. కార్మిక ఐక్య ఉద్యమాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ అల్లూరి ఆశయాలను పక్కన పెట్టి నేటి పాలకులు సామ్రాజ్యవాదులకు, బహుళజాతి కార్పొరేట్ శక్తులకు సేవ చేస్తున్నారన్నారు. ఆ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విశాఖ రక్షణ రంగంలో డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ భాగస్వామ్య పక్షాలు సంవత్సరంలో మూడు సార్లు రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వై.ఆంజనీ రాజేష్ వందన సమర్పణ చేయగా నాగేశ్వరరావు, భాను, శేఖర్, మోహన్, కాశీం, స్వామి, జగదీష్, నాగార్జున, రాజారావు, శ్రీనివాసరావు, అనిల్ రెడ్డి పాల్గొన్నారు. 50 మంది దాతలు రక్తదానం చేశారు.

భూముల వ్యవహారంపై సిఎస్ చర్చకు సిద్ధమా ?

ప్రజాశక్తి - సీతమ్మధార : భూముల కాజేతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి తనతో చర్చకు సిద్ధమా ? అని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సవాలు విసిరారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 596 జిఒను సాకుగా చేసుకొని బినామీల ద్వారా వందల ఎకరాల భూములను కొట్టేశారనే ఆరోపణలను రుజువు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఆయన ఇచ్చే లీగల్ నోటీసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. గురువారం విశాఖలో విలేకరులతో మూర్తియాదవ్ మాట్లాడుతూ అన్నవరం సమీపంలోని ఎ -1 హోటల్ అధినేత చోడ్రాజు సత్యకృష్ణంరాజు, విశాఖకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పేరిచర్ల శ్రీనివాసరాజులు జవహర్ రెడ్డికి బినామీలుగా వ్యవహరించారని అన్నారు. సూర్రెడ్డి త్రిలోక్ జవహర్ రెడ్డి వ్యవహారాలకు బ్రోకర్ అని ఆరోపించారు. వందల కోట్ల లావాదేవీలు, వందల ఎకరాల వ్యవహారాలు చోడ్రాజు సత్యకృష్ణంరాజుతో జవహర్ రెడ్డి చేయడం వల్లే గత నెల 17న కృష్ణంరాజు క్యాన్సర్‌తో మృతిచెందితే జవహర్ రెడ్డి ఆఘమేఘాల మీద అన్నవరం వచ్చారని అన్నారు.

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు మహారాణిపేట మండలంలో నిర్వహిస్తున్న 18 ఏళ్లలోపు బడి బయట ఉన్న విభిన్న ప్రతిభావంత పిల్లల గుర్తింపు నమోదు సర్వే కార్యక్రమాన్ని డిఇఒ చంద్రకళ గురువారం పర్యవేక్షించారు. విభిన్న ప్రతిభావంత పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న చదువు, ఫిజియోథెరపీ సేవలు, ప్రభుత్వం ద్వారా వచ్చే ఉపకార వేతనాలు, ఇతర రాయితీల వివరాలను వారి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సర్వే జూన్ 9 వరకు కొనసాగుతుందని ఎంఇఒ పైడపు నాయుడు, బి.పుష్యరాగం తెలిపారు. మండలంలో ఇప్పటివరకు చేపట్టిన సర్వేలో 20 మంది బాలలను గుర్తించి వారి వివరాలు నమోదు చేశామని తెలిపారు.

లెక్కింపు ఏర్పాట్లలో తలమునకలు

బిజీబిజీగా అధికార యంత్రాంగం
స్ట్రాంగ్ రూమ్ వద్ద కమాండ్ కంట్రోల్ గదులు
అక్కడ నుంచే అభ్యర్థులు కౌంటింగ్ ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్వారత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తోంది. మరో నాలుగు రోజుల సమయమే వుండడంతో లెక్కింపు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలైవుంది. జూన్ 4న ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియను ముగించాలన్న యోచనలో యంత్రాంగం వుంది. ఈ క్రమంలోనే ఎటువంటి అనుమానాలు, వివాదాలకూ తావులేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థులు పదేపదే లెక్కింపు చోటకు వెళ్లకుండా క్లాక్‌వైజ్ వెబ్ కాస్టింగ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లు రెండు సిద్ధం చేస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంల లెక్కింపు జరుగుతున్న తీరును కమాండ్ కంట్రోల్ గదుల నుంచి పరిశీలించవచ్చు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి వేర్వేరుగా రెండు కమాండ్ కంట్రోల్ గదులను సిద్ధం చేయాలని సూచించారు. ఒక కమాండ్ కంట్రోల్ గది నుంచి ఎన్నికల పరిశీలకులు, ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులు లెక్కింపును పరిశీలించి ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వనున్నారు. మరొక గదిలో ఓట్ల లెక్కింపును ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పరిశీలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.. అభ్యర్థులెవరికి లెక్కింపులో ఎటువంటి అభ్యంతరాలున్నా వెంటనే తెలియజేస్తే వాటిని నివృత్తి చేయనున్నారు. అభ్యర్థులు ప్రతిసారీ తన నియోజకవర్గ ఓట్ల లెక్కింపు టేబుల్స్ వద్దకు వెళ్లాల్సిన అవసరంలేకుండా కంట్రోల్ రూమ్ నుంచే తెలుసుకొనేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. గతంలో ఈ తరహా కంట్రోల్ రూమ్‌లు లేవు. ప్రశాంత కౌంటింగ్‌కు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో వ్యవహరిస్తున్నాయి. ఎన్నికల అధికారి లెక్కింపు దగ్గరకు వెళ్లకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించడం మరింత సులభతరమవుతుంది. సిసి కెమెరా నిఘాలో లెక్కింపు వుంటుంది. లెక్కింపు మొత్తం రికార్డు కానుంది. ఇప్పటికే లెక్కింపు సిబ్బందికి తొలి దశ ర్యాండమైజేషన్ పూర్తికాగా, రెండో దశ ర్యాండమైజేషన్ జూన్ 2న, చివరిగా లెక్కింపు రోజున ఉదయం 5 గంటలకు జరగనుంది. లెక్కింపు వ్యహారమంతా పరిశీలకులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయక రిటర్నింగ్ అధికారులు, ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో జరగనుంది. అదే సమయంలో సాంకేతిక కారణాలతో ఇవిఎంల లెక్కింపులో ఏమైనా సమస్యలు ఏర్పడితే వెంటనే పరిష్కరించేందుకు బెల్ ఇంజినీర్లను అందుబాటులో వుంటారు. ఇవిఎం ఓపెన్ కాకపోయినా, మధ్యలో ఆగిపోయినా అది సమస్యగా మారకుండా సాధారణ స్థితికి తీసుకొచ్చేలా నిపుణులను సిద్ధం చేశారు.

న్యాయం కోసం మాజీ మిస్ వైజాగ్ నక్షత్ర ఆందోళన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తన భర్త తేజ నిత్యం వేధిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ మిస్ వైజాగ్ నక్షత్ర విశాఖ నగరంలోని దసపల్లా హిల్స్‌లోని భర్త ఆఫీస్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టింది. అంతకుముందు ఆమె భర్త తేజ ఓ గదిలో మరో మహిళతో కలిసి ఉండగా పోలీసులు, మీడియా ప్రతినిధులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అప్పగించింది. అనంతరం తనకు న్యాయం చేయాలని నినదించింది. తనకు విడాకులు ఇవ్వకుండా మరో స్త్రీని పెళ్లి చేసుకొని కాపురం చేస్తున్నాడని ఆమె పేర్కొంది. 2013లో ఓ సినిమా షూటింగ్‌లో తనకు తేజతో పరిచయమైందని, 2017లో ప్రేమించి పెళ్లి చేసుకున్నామని చెప్పింది. తమకు ఒక పాప ఉందని పేర్కొంది. నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగి అయిన తేజ ప్రవర్తన బాగోలేక విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఆమె తెలిపారు. అంతేగాకుండా తన భర్త తేజ పబ్జీ గేమ్, క్లబ్ హౌస్ యాప్‌ల ద్వారా అమ్మాయిలను ట్రాప్ చేసి వారిని శారీరకంగా వాడుకుంటూ ఉంటాడని ఆరోపించింది.

నేడు యూనియన్ బ్యాంక్ రిటైల్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన శుక్రవారం నగరంలోని బుల్లయ్య కళాశాల సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో రిటైల్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. ఈ మేరకు బ్యాంక్ అధికారులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎక్స్‌పోలో భాగంగా ప్రముఖ బిల్డర్లు, ప్రముఖ వాహన డీలర్లు, ఇతర వాణిజ్య సంస్థలవారు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని, నగర ప్రజలందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా బ్యాంకు నిబంధనలకు లోబడి తక్షణ రుణ అవసరాల కోసం బ్యాంకు అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పలు కారణాలతో రైల్వే అధికారులు ఒక రైలును రద్దు చేసి, మరికొన్నింటిని దారి మళ్లించారు. ఈ మేరకు లండింగ్ డివిజన్‌లోని న్యూ హాఫ్లాంగ్ - బందర్‌ఖల్ రైల్వే స్టేషన్ మధ్య ట్రాక్ సస్పెన్షన్ కారణంగా 12513 సికింద్రాబాద్ - సిల్చార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 01న రద్దు చేశారు. సంబల్‌పూర్ డివిజన్‌లోని సంబల్‌పూర్ - జార్సుగూడ సెక్షన్ మీదుగా సరళ స్టేషన్‌లో సరుకు రవాణా పరీక్షా మార్గాన్ని ప్రారంభించడం కోసం ప్రీ-నాన్ ఇంటర్ లాకింగ్, ఇంటర్ లాకింగ్ వర్క్‌ల కారణంగా ఎర్నాకులం నుంచి బయలుదేరే 18190 ఎర్నాకులం -టాటా ఎక్స్‌ప్రెస్ జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు విజయనగరం, ఖుర్దా రోడ్, కటక్, జఖాపురా, జరోలి మీదుగా మళ్లించబడుతుంది.

టాటా నుంచి బయలుదేరే 18189 టాటా - ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ జూన్ 7 నుండి 14 వరకు జరోలి, జఖాపురా, కటక్, ఖుర్దా రోడ్, విజయనగరం మీదుగా మళ్లించబడుతుంది. కావున ఈ రైళ్లకు బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగూడ, అంబోదల, కేసింగ, టిట్లాగఢ్, బలంగీర్, బర్గర్ రోడ్, సంబల్‌పూర్, ఝర్సుగూడ, బ్రమా, రాజ్ గ్యాంగ్‌పూర్, రూర్కెలా, జరైకెలా, గోయిల్‌కేరా, చక్రధర్ పూర్ స్టాప్‌లను తొలగించారు.


తల్లిదండ్రులతో మనోహర్

సత్తా చాటారు

- ఎపి ఈసెట్‌లో ప్రతిభ చూపిన ఉమ్మడి విశాఖ విద్యార్థులు

గురువారం విడుదలైన ఎపి ఈసెట్ ఫలితాల్లో విశాఖ, అనకాపల్లి విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడంతో వారిని పలువురు అభినందించారు.

ప్రజాశక్తి - గాజువాక : ఎపి ఈసెట్ ఫలితాల్లో యారాడ గ్రామానికి చెందిన బంక మనోహర్ రాష్ట్ర రెండో ర్యాంకు సాధించాడు. ఆయన తండ్రి గురునాథరావు సెక్యూరిటీ గార్డు, తల్లి పాపాజీ గృహిణి. మనోహర్ పదో తరగతి వరకు మల్కాపురంలోని సరస్వతి పాఠశాలలో చదివాడు. తొలి నుంచీ విద్యలో ముందుండేవాడు. తర్వాత కంచరపాలెంలోగల డిప్లొమా ఇన్ కెమికల్‌లో ప్రవేశించి ఇప్పుడు ఈసెట్ ఫలితాల్లో సత్తా చాటాడు. తెలంగాణ ఈసెట్ ఫలితాల్లో సైతం స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి విశాఖ కీర్తిప్రతిష్టలను చాటిచెప్పాడు. భవిష్యత్తులో గేట్ సాధించడమే తన లక్ష్యమని మనోహర్ 'ప్రజాశక్తి'కి తెలిపాడు.

అనకాపల్లి : ఎపి ఈసెట్ ఫలితాల్లో అనకాపల్లి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం గ్రామానికి చెందిన మేడిశెట్టి వైభవ్ మూడో ర్యాంకు, అనకాపల్లి విజయరామరాజుపేటకు చెందిన భీశెట్టి దివాకర్ ఏడో ర్యాంకు సాధించారు. దివాకర్ విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివాడు. వారిని పలువురు అభినందించారు.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ తప్పనిసరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : జూన్ 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతున్నందున స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను ఆలోగా పూర్తి చేసుకోవాలని స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలకు జిల్లా ఉప రవాణా కమిషనర్ రాజారత్నం సూచించారు. గురువారం విశాఖలోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో స్కూలు, కళాశాల బస్సుల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ స్కూలు, కళాశాల బస్సులలో డ్రైవర్లుకు కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. 50 సంవత్సరాల వయస్సు మించరాదని తెలిపారు. డ్రైవర్లకు విధిగా కంటి ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. త్రైమాసిక పన్నులు బస్సుల సిటింగ్ పరిమితిని బట్టి కట్టాల్సి ఉందన్నారు. స్కూలు బస్సులో తప్పనిసరిగా ఒక సహాయకుడు ఉండాలని సూచించారు. ప్రతి స్కూలు యాజమాన్యం రహదారి భద్రతకు సంబంధించిన ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ నెలకొకసారి సమావేశం నిర్వహించాలని సూచించారు. స్కూలు ఆటోలలో ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉండేలా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనన్నారు.

12 నుంచి స్పెషల్ డ్రైవ్

పాఠశాలలు, కళాశాలల బస్సులపై జూన్ 12 నుండి 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు రాజారత్నం తెలిపారు. ఫిట్‌నెస్ చేయని బస్సులను సీజ్ చేయడంతో పాటుగా పాఠశాల, కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టిప్పరు బోల్తా

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సాగుల ఘాట్ రోడ్‌లో గురువారం టిప్పర్ బోల్తా పడింది. జీకే వీధి మండల లక్కవరం నుంచి అగ్రహారం వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి గ్రావల్ టిప్పర్‌తో తరలిస్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణాన్ని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. టిప్పర్ పైన కూలీలు ప్రయాణించి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని పలువురు భావించారు.